# రోడ్డు మీద దేవుడు

శ్రీ కంఠస్ఫూర్తి

అతను జీసస్...

లోకంలో కరుడుగట్టిన పాప భారాన్ని తలపై ముళ్ళ కిరీటంగా భరించిన మానవతా మూర్తి... కసాయి శాసనం కర్ర శిలువ మీద... దురహంకారుల దౌష్ట్యానికి, దుర్మార్గానికి మేకులతో శిక్ష పొందిన మేరీ తనయుడు... నెత్తురు ఓడుతూన్న శరీరంతో నిస్సహాయుడిగా - నిర్జీవుడైన పవిత్రమూర్తి... పరిశుద్ధాత్మ!

అదిగో ఆ పూట రోడ్డు మీద వెలిశాడు...!

వెలిసిన ఆ పరిశుద్ధాత్మ మీద పది పైసల బిళ్ళలు, పావలాలు; రూపాయి కాసులు, మరెన్నో చిల్లర నాణాలు చిందర వందరగా పడుతున్నాయి...

ఉదయం తొమ్మిది గంటలు దాటింది... రోడ్డు మీద అప్పటికే రద్దీ ప్రారంభమైంది...

కళ్ళకు కట్టినట్లుగా, కరుణ రస ప్లావితంగా, క్రీస్తు బొమ్మను ఆ రోడ్డు వారగా గీసిన రావుడు ముఖం మీద చెమటను తుడుచుకున్నాడు. రంగు రంగుల సుద్ద ముక్కల్ని దగ్గరికి చేర్చుకున్నాడు... గీసిన బొమ్మను ఆసాంతం పరికించి తృప్తిగా నిట్టూర్చాడు.

రావుడి చుట్టూ - నలుగురైదుగురు జనం ఆసక్తిగా నిలబడి చూస్తున్నారు... రోడ్డు మీద వచ్చి పోయే మనుషులు, ఒక నిముషం అక్కడ ఆగి చిల్లర విసిరి చరచరా కదిలి పోతున్నారు.

కడుపులో ఆకలే ఆ కళ నేర్పిందో - జన్మనిచ్చిన - అనామకుల నుంచే సంక్రమించిందో - చిరుత ప్రాయంలోనే "చిత్రకళ" అత్యద్భుతంగా అలవడిందనుకుంటూ అబ్బురపడుతున్నారు...!

రావుడి కళ్ళల్లో కృతజ్ఞత తొణికిసలాడుతోంది...

చేయెత్తి చిల్లర విసిరిన వాళ్ళందరికీ దణ్ణం పెడుతున్నాడు...

రోడ్డు మీద బొమ్మలు గీసే ఆ రావుడి వయస్సు పదేళ్ళే. రోజుకో సెంటరులో రంగు రంగుల సుద్దలతో రక రకాల దేవుళ్ళని సృష్టిస్తుంటాడు... తల్లెవరో తెలియదు... తండ్రెవరో తెలియదు... ఊహ వచ్చినప్పటి నుంచి దేవుళ్ళ బొమ్మల్నే గీస్తూండడంతో - కొందరు దేవుడని, కొందరు రావుడని పిలుస్తూ ఉంటారు.

రావుడు బొమ్మ గీయడం పూర్తి చేసి నెమ్మదిగా లేచాడు. మల్లయ్య - కొట్టు వైపుగా అడుగులు వేశాడు. మల్లయ్య ఫుట్‌పాత్ మీద నాలుగు చక్రాల బండిలోనే బన్ రొట్టు, టీ అమ్ముతుంటాడు.

"ఏంత్రా! రావుడూ! ఏసు పెబువు బొమ్మేసినావేటి? డబ్బులు బాగా రాల్తాయిలే!"

మల్లయ్య రావుణ్ణి పలకరించాడు.

రావుడు చిన్నగా నవ్వి పావలా కాసు మల్లయ్య చేతిలో పెట్టాడు... మల్లయ్య ఇచ్చిన టీ త్రాగుతూ నిలబడ్డాడు.

రోడ్డు మీద వాహనాల రొద ఎక్కువయ్యింది... అల్లంత దూరంలో రాజుల భోజన హొటలు ముందు మైకులో బాల మురళి గొంతు శ్రావ్యంగా వినబడుతోంది... గంట స్తంభం ముందు సిమెంటు చప్టా మీద కానిస్టేబులు, కథక్ నృత్యం - అభ్యాసంలో అవస్థలు పడుతున్నాడు... ఎదురుగా గోడ మీద సినిమా పోస్టరును - అందుకోవడానికి ఓ గంగి గోవు గంగవెర్రులెత్తుతోంది.

రావుడు మళ్ళీ యథా స్థానానికి వచ్చాడు. దీక్షగా కూర్చున్నాడు... సుద్ద ముక్కల్ని చేతిలోకి తీసుకున్నాడు... మనసులో ఊహించుకున్న రూపాన్ని మననం చేసుకుంటూ కొద్ది క్షణాలు కళ్ళు మూసుకున్నాడు. మరు క్షణంలో రోడ్డు మీద గీతలు గీశాడు... ఆకారం తేల్చాడు... రంగులు పూశాడు... అలంకరణ పూర్తి చేశాడు.

అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు... దేవుళ్ళ బొమ్మలు గీసే రావుడు... ఈ బొమ్మను గీయటమేమిటా అని... ఆ బొమ్మ పేరు అమ్మ...! చిన్నారి శిశువుకు స్తన్యం కుడుపుతూ పరవశించిపోతూన్న మాతృమూర్తి!

రావుడు ఆ బొమ్మను తదేకంగా చూస్తున్నాడు.. తన్మయత్వంతో మురిసి పోతున్నాడు... తనను కన్న తల్లి ... అమ్మ కూడా ఇలాగే ఉంటుందా?... తను గీసిన బొమ్మలో అమ్మ రూపాన్ని అందంగా ఊహించుకుంటున్నాడు.





రావుడికి తన అమ్మ రూపం ఎలా ఉంటుందో తెలియదు... పుట్టి బుద్దెరిగిన తరువాత అమ్మలాంటి స్త్రీ ఎవరూ అతన్ని చేరదీయలేదు... లోకంలో అమ్మల్ని చూసి రావుడూ తన అమ్మ కోసం ఎన్నో రాత్రులు కలవరించాడు... పలవరించాడు... ఎన్నో ఒంటరి రాత్రులు వెక్కి వెక్కి ఏడ్చాడు...

రావుడు చిన్నప్పటి నుంచి చిన దాదా దగ్గరే పెరిగాడు... చిన దాదాయే పూటకింత తిండి పెట్టాడు !... రాత్రులు పడుకోవడానికి ఇంత చోటు చూపించాడు...

చిన దాదా దగ్గర... పది మంది పిల్లలు ఉండేవాళ్ళు... ఒక్కొక్కళ్ళకి ఒకో రకం పని పురమాయించేవాడు చిన దాదా...! బస్టాండ్‌లో జేబులు కత్తిరించడం - మొదలు బారుల్లో గ్లాసులు, సోడాలు అందించే పనుల వరకూ కుర్రాళ్ళు చాకచక్యంగా పని చేసేవాళ్ళు... రావుడి చేతిలో బొమ్మలు గీసే నైపుణ్యం చూసి చిన దాదా రావుణ్ణి అ పనిలోనే డబ్బు సంపాదించమన్నాడు...

చిన దాదా ఎక్కువగా మాట్లాడేవాడు కాదు... గొంతు విప్పితే సింహం గర్జించినట్లే ఉండేది... కోపం వస్తే పిల్లలు గజగజా వణికి పోయేవాళ్ళు... చిన దాదాకు దయా దాక్షిణ్యాలు ఉండేవి కాదు... తను చెప్పిన పని పిల్లలు సరిగ్గా చేయకపోతే దండన చాలా తీవ్రంగా ఉండేది... కొద్ది రోజులు గదిలో బంధించి తిండి పెట్టకుండా మాడ్చేవాడు... చేతుల మీద, కాళ్ళ మీద వాతలు పెట్టేవాడు... ఏ కుర్రాడైనా చెప్పకుండా పారిపోతే ... వేట కుక్కల్లాంటి మనుషుల్ని పంపి వెంటాడి పట్టుకునేవాడు... వెతికి పట్టుకున్న ఆ కుర్రాడ్ని నిర్దాక్షిణ్యంగా కాలో చెయ్యో విరిచేసి మూల కూర్చోబెట్టేవాడు... ఆ పై ముష్టి వాడి క్రింద మార్చేసేవాడు...

చిన దాదా ఈ మధ్యనే, పోలీస్ స్టేషన్‌లో మగ్గిపోయి, ముగ్గిపోయి ... బయటికొచ్చి ముక్కుతూ, మూలుగుతూ రక్తం కక్కుకుని మరీ చచ్చిపోయాడు...

రావుడు అమ్మ బొమ్మని దీక్షగా చూస్తోంటే ... చిన దాదా గుర్తుకొచ్చాడు... ఒళ్ళు జలదరించినట్లయింది... కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగి అమ్మ బొమ్మ మీద పడ్డాయి... అమ్మ రూపం ఎలా ఉండేది? ఎన్నో విధాల ఊహించుకున్నాడు రావుడు... అస్పష్టంగా ఉన్న అనేకమైన ఊహల్ని కలగలుపుకుని ఈ రోజు పట్టుదలగా అమ్మ బొమ్మను గీశాడు... అమ్మ ఇలాగే ఉండేదా? రావుడు అమ్మ రూపాన్ని తలుచుకుంటూ ఆలోచిస్తున్నాడు.

అమ్మ బొమ్మ మీద కూడా అవిరళంగా - చిల్లర వర్షం కురుస్తోంది... రావుడు కిప్పుడు రోజులు బాగానే గడుస్తున్నాయి... దేవుడి బొమ్మలు గీయడంలో రెండు పూటలకీ తిండి దొరుకుతోంది... నెల కో పాత చొక్కా... నిక్కరు కొనుక్కోగలుగుతున్నాడు... కాని తనకు ఎవరూ లేరనే బెంగలో, ఒంటరితనంలో అమ్మ గుర్తుకు వస్తే... రావుడు క్రుంగిపోతాడు... అలవికాని బాధతో అల్లల్లాడిపోతాడు...!

అమ్మ బొమ్మ మీద పడుతోన్న చిల్లర డబ్బుల్ని చూస్తోంటే రావుడి కళ్ళు తడిసిన కలువ పూవుల్లా తళుకులీనుతున్నాయి...

"ఒరేయ్ ! రావుడూ !"

అమ్మ బొమ్మ మీద పైసలు ఏరుకుంటూ రావుడు తలెత్తి చూశాడు...

ఎదురుగా జంగం తాత... కాషాయ గుడ్డల్లో బవిరి గెడ్డాన్ని సవరించుకుంటూ వరమిచ్చే జంగమ దేవుడిలా నిలబడ్డాడు... జంగం తాత - ముష్టి వాళ్ళందరికీ పెద్ద దిక్కు... శివాలయం పక్కనున్న సత్రంలో - తత్వాలు పాడుకుంటూ ఉంటాడు... అందరి మంచి చెడ్డలు విచారిస్తూంటాడు... రావుడంటే ఎడతెగని అభిమానం...

"దేవుళ్ళ బొమ్మలు గీసే నువ్వో ఒక దేవుడివేరా రావుడూ!" అంటూ రాత్రుళ్ళు తన దగ్గరే పడుకోబెట్టుకుంటాడు... రావుడు సంపాదించిన డబ్బులు, జంగం తాత దగ్గర దాచుకోవడం రివాజు...

"నీ కో తియ్యటి తాయిలం పెడతాన్రా... నాతో వస్తావా?" జంగం తాత నవ్వుతూ రావుణ్ణి అడిగాడు...

"ఏంటి తాత ! తాయిలం పెడతావా? ఏంటది?" రావుడు పైసల్ని సుద్ద ముక్కల్ని జేబులో కుక్కుకుంటూ తాత దగ్గరగా వచ్చాడు.

"అవున్రా రావుడూ... నీకు అమ్మ తాయిలం పెడతాను... అమ్మని చూపిస్తాను... నీకు అమ్మ లేదని ఎన్నాళ్ళుగానో ఏడుస్తున్నావు కదరా ! నిన్ను కన్న అమ్మ బతికే ఉంది... ఈ పూటే ఊళ్ళోకి వచ్చింది రా ! ... వెళ్దాం...!"

రావుడికి నోట మాట రాలేదు...! గుండె దడదడా కొట్టుకుంది... గుడ్లప్పగించి ... దిష్టి బొమ్మలా - జంగం తాతనే చూడసాగాడు...

అమ్మ... తనకూ ఓ అమ్మ ఉందా?... ఆ అమ్మ బ్రతికే ఉందా? ఈ పూట ఊళ్ళోకి వచిందా? నిజమే? తనకో అమ్మ ఉందని జంగం తాత ఎప్పుడూ చెప్పలేదే? చనిపోయిన చిన దాదా కూడా ఎన్నడూ అమ్మ మాట ఎత్తలేదే? జంగం తాత అబద్ధం చెప్పడు... అమ్మ ఇన్నాళ్ళకు ఈ ఊరొచ్చిందేమో... జంగం తాతని గుర్తుపట్టి తన ఆచూకీ అడిగిందేమో...!

రావుడి హృదయం గంతులు వేస్తోంది...!

జంగం తాత గబగబా ముందుకు నడుస్తోంటే - రావుడి అడుగులు తడబడుతున్నాయి - గాలిలో తేలిపోతున్నట్టే నడుస్తున్నాడు...

లోకంలో కళ్ళ ముందు కనిపించే అమ్మలు ఎంతో మంది... బిడ్డలకు - పాలిచ్చే అమ్మ... లాలించే అమ్మ... ఎత్తుకుని ముద్దాడే అమ్మ... గోరు ముద్దలు తినిపించే అమ్మ... జోల పాటతో నిద్ర పుచ్చే అమ్మ... కోరిన కోర్కెలనల్లా కొండంత ప్రేమతో తీర్చే అమ్మ... అలాంటి ... అమ్మ... అందరిలా తనకూ ఓ అమ్మ... ఎంత అదృష్టం ? ...

అమ్మ... ఇన్నాళ్ళూ తనకు దూరంగా ఎందుకు ఉంది? ఎక్కడ ఉంది?... చిన దాదాకు తనని ఎందుకు అప్పగించిపోయింది?... అసలు అమ్మ

## జయ ధ్వజం


గెలుపు కోసం గుండెను
యజ్ఞ కుండం చేస్తున్నాను !
ఆత్మ శక్తుల్ని
ఆత్మీయతానురక్తుల్ని
ఆజ్యంగా పోస్తున్నాను !

నిశ్శబ్ద సమాధిలో
చరిత్రల చిరునవ్వుల లోంచి
నవ్య ప్రకరణాలు సృష్టించాలని
నాగరికతల్ని రగిల్చి
సాంస్కృతిక ప్రభలతో
తిరిగి విక్రమిస్తున్నాను !

జయ ధ్యానాల కోసం
తలుపులు తీసి
దారులన్నీ గాలిస్తున్నాను !

ఈ మహీతలం మీద
మానవతా పతాకాన్ని
ఆవిష్కరిస్తూ
అజేయ మనీషను
ఆవాహన చేస్తున్నాను !

ఆచార్య తిరుమల



ఎలా ఉంటుంది?... ఎన్నాళ్ళుగానో ఊహించుకుని గీసిన అమ్మ బొమ్మలాగే ఉంటుందా అమ్మ? అమ్మతో ఏమని మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి?

రావుడి మనసు చిత్రంగా ... చింతగా ఆక్రోశిస్తోంది !...

జంగం తాత గంట స్తంభం జంక్షను దాటించాడు... అడ్డ రోడ్డు వద్ద మలుపు తిరిగాడు... రైల్వే కట్ట వారగా కంకర రాళ్ళ మీద నడిపించాడు... సన్నటి మురికి కాలువ సందులోంచి ముందుకు తీసుకు వెళ్ళి మళ్ళీ రోడ్డెక్కించాడు... రావుడికేదో కొత్త జన్మ ఎత్తినట్లుగా ఉంది... అమ్మను చూడబోతున్నానన్న ఆనందం ... అణువణువునా పెల్లుబుకుతోంది....

జంగం తాత రావుణ్ణి కనకదుర్గమ్మ కొండ దగ్గరకు తీసుకు వచ్చాడు. కొండకు దిగువగా మెట్ల దగ్గర ఆగి అటూ ఇటూ చూశాడు... మెట్లకు కాస్త ఎడంగా ఒంటరిగా కూర్చున్న ఓ ఆకారాన్ని రావుడికి చూపించాడు...

"ఒరేయ్! రావుడూ! అదిగోరా నిన్ను కన్న అమ్మ... వెళ్ళు... పలకరించు... !"

రావుడికి నోట మాట రాలేదు... నిలుచున్న చోటి నుంచి అడుగు ముందుకు వేయలేదు... ఆ ఆకారాన్ని తదేకంగా గుడ్లప్పగించి చూస్తున్నాడు... మనిషి నిలువెల్లా వణుకుతున్నాడు... మనసులోనే - అమ్మ... అమ్మ... అంటూ ఆర్ద్రంగా పలవరిస్తున్నాడు... కానీ - అమ్మ... అమ్మ ఇలా ఉందేమిటి? ఈ ఆకారం ఏమిటి? ఈ అమ్మ తనకు నిజంగా అమ్మేనా?... అమ్మ ఎందుకిలా ఉంది?...

"ఇదిగో మాణిక్యం! నీ కొడుకు ... రావుడు, నిన్ను చూడడానికి వచ్చాడు !..." జంగం తాత మాణిక్యాన్ని పలకరించాడు.

మాణిక్యం, మాసిన చిరుగుల గుడ్డ కప్పుకుని ఉంది... కట్టుకున్న చీర, రవికె పీలికలు పీలికలుగా వ్రేలాడుతున్నాయి... ఆమె చక్రాల బండి లాంటి చెక్క బల్ల మీద కూర్చుని ఉంది... ముఖంలో ముక్కు అణిగిపోయి ... చెవులు చివికిపోయి ... పెదాలు పాచిబారి ... కళ్ళు గోళీలై... మొండి చేతులతో ముసిరే ఈగలతో ... రసి కురుపులతో ...

రావుడు అమ్మ రూపాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు...

"రావుడి బిడ్డా!... ఒచ్చావా నాయనా!... నా తండ్రీ! నా రావుడి బిడ్డ నన్నెప్పుడో నూట్టానికి ఒత్తడని కళ్ళల్లో పేణాలు పెట్టుకుని నూత్తన్నాన్రా! రా రా నా బిడ్డా! నా బతు క్కీ కుళ్ళిపోయే రోగమొచ్చి ... నన్నందరూ రోడ్డు మీదికిసిరేత్తే కడుపున పుట్టిన బిడ్డతోనన్నా బతుకీడ్చుకుందామని కొండంత సంబరం పడ్డాన్రా బాబూ! అయిదు నెలల బిడ్డడ్ని అమాంతం ఎత్తుకుపోయి చిన దాదా నా కన్నేయం చేసేనాడ్రా కొడుకా! బిడ్డా! రావుడా! నన్నిప్పుడు నూట్టానికొచ్చావురా నాయినా! నిన్నిప్పుడు నూద్దామన్నా నాకు కంటి నూపు నేదు... బతుకెప్పుడో సీకటయిపోనాది కొడకా... సీకటయిపోనాది..."

మాణిక్యం ముఖం మరింత వికృతంగా మార్చుకుని శాపగ్రస్తలా విలపిస్తోంది... రావుణ్ణి దగ్గరకు - రారమ్మని గాలిలో చేతులు కదుపుతూ దీనంగా పిలుస్తోంది... ఆమె గాజు కళ్ళ నుంచి - గోదావరి వరదలా కన్నీరు పొంగి పొంగి ధారలు కడుతోంది...

## అనివార్యం

అప్పటి కప్పుడు కాదు
ఎప్పు టెప్పటి నుంచో పయనిస్తున్న సూర్యబింబం
చీకటి గోడలను కూలుస్తూ
చివరి మజిలీకి చేరుకునే సమయం ఉదయం!

ఉదయం లాంటిది కవిత్వం
ఉవ్వెత్తున పైకి లేచినప్పటి నుంచీ
ఉడు కెత్తుతూ సమస్తాశావకాశాల్లోనూ
ఉరికి పరుగెడుతుంది విహంగంలా

విహంగంలాంటిది జీవితం
రెక్కలు విప్పుకున్నది లగాయతు
విశ్రాంతి మృగతృష్ణ కాగా
విహరిస్తుంది ఆలోచనలా

ఆలోచన లాంటిది ప్రపంచం
కాలాన్ని ఆలంబనంగా చేసుకుని
కదిలిపోతూ తలక్రిందులయ్యేందు క్కూడా
కాదనదు! ఎవరి మాటా వినదు! గతం
కనుగొనదు!

- మిరియాల రామకృష్ణ

జంగం తాత - మాణిక్యాన్ని రావుణ్ణి మార్చి మార్చి చూస్తున్నాడు.

రావుడు ఒక అడుగు ముందుకు వేశాడు... మాణిక్యం దగ్గరగా వెళ్ళాడు... చటుక్కున మాణిక్యం చక్రాల బండి తాడును పట్టుకున్నాడు... చరచరా రోడ్డు మీద ముందుకు లాక్కుని పోతున్నాడు...

"అమ్మా! నేను నీ బిడ్డనే! రావుణ్ణి రోడ్డు మీద రావుణ్ణి... దేవుళ్ళ బొమ్మలు గీసే రావుణ్ణి ... ఇన్నాళ్ళూ అనాథగా బతికిన వాణ్ణి.. నాకూ ఓ అమ్మ లేదని ఏడ్చిన వాణ్ణి... ఈనాడు అమ్మను చూసి నేనూ ఓ బొమ్మనయిపోయిన వాణ్ణి... అమ్మా! నువ్వు నాకు అమ్మవే !... అమ్మవు నువ్వెలా ఉన్నా నాకు అమ్మవే! నాకు జన్మ నిచ్చిన నిన్ను వదులుకోను... ఇకపై నీ చీకటి బ్రతుక్కి దీపంగా వెలుగుతాను... నీకు అండగా నీ బండిని లాగుతాను... రోజూ నా చేతులతో - నీ కింత అన్నం పెడతాను... అన్నం పెడతాను..."

ఉప్పొంగే మనసుతో ... ఏదో పెన్నిధి దొరికినట్లు మాణిక్యాన్ని మును ముందుకు తీసుకు పోతున్నాడు రావుడు... రావుణ్ణి, చక్రాల బండి మీద మాణిక్యాన్ని మందస్మిత వదనంతో చూస్తున్నాడు - జంగం తాత... అతని హృదయం అమృతభాండంలా తొణికిసలాడుతోంది...

"రావుడూ! రోడ్డు మీద దేవుడూ! మాణిక్యం నీకు అమ్మా కాదు... మాణిక్యానికి నువ్వు బిడ్డవూ కాదు... నిన్ను కన్న అమ్మ ఎవరో నాకూ తెలియదు... ఇద్దరూ అనాథలే! ... దురదృష్టవంతుళ్ళే... మాణిక్యానికి ఎవరూ లేరు... ఆదరించే వాళ్ళు లేరు... ఆకలి తీర్చేవాళ్ళు లేరు... కళ్ళు పోయి, మనిషి కుళ్ళిపోయి, ఈసడించుకునే ఈ జనం మధ్య చావలేక, బ్రతకలేక - ఆకలి తీరే దారి ఏదైనా చూపించమని నా కాళ్ళ మీద పడింది... మాణిక్యాన్ని నీకు అమ్మగా - నేను అబద్ధం చెప్పినా ... నీ కో అమ్మను చూపించడంలో నా కో పరమార్థం కనిపించింది... రోడ్డు మీద నువ్వు గీసే దేవుడి బొమ్మ నీ కింత అన్నం పెడితే ... ఈ దౌర్భాగ్యపు అమ్మకు ఆకలి తీర్చే నువ్వూ ఒక దేవుడివే!... రోడ్డు మీద దేవుడివే!... ఇకపైన మీరిద్దరూ - ఒకరి కొకరు తోడూ నీడా ... అనాథ శరణం గచ్ఛామి... శరణం గచ్ఛామి... !"

జంగం తాత వాళ్ళిద్దర్నీ కలిపిన దేవ దూతలా ఆనందాశ్రువులు రాలుస్తున్నాడు...

రోడ్డు మీద దేవుడు ముందుకు సాగుతూనే ఉన్నాడు !... ✱

